అక్రమాలకు పాల్పడుతున్న పోలీసులపై కొరడా

- **పలువురు పోలీసులను బదిలీ చేసిన ఎస్పీ**

నీలగిరి, సెప్టెంబర్ 12 : మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు రావడంతో ఎస్పీ శరత్‌చంద్ర పవార్ వారిపై చర్యలు తీసుకున్నారు. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ నరేశ్‌ను వీఆర్‌కు అటాచ్ చేయగా, ఏఎస్ఐ యాదగిరిని చందంపేటకు, హెడ్ కానిస్టేబుల్ దుస్రనాయక్‌ను చింతపల్లికి బదిలీ చేశారు. నల్లగొండ ట్రాఫిక్ సీఐగా పనిచేస్తున్న క్రాంతికుమార్‌ను హైదరాబాద్ రేంజ్‌కు బదిలీ చేయగా తిప్పర్తి ఎస్ఐగా పనిచేస్తున్న దుడి రాజుకు పదోన్నతి కల్పించి నల్లగొండ ట్రాఫిక్ సీఐగా బాధ్యతలు కేటాయించారు. దాంతో రాజు గురువారం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లగొండ పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలి

- **డీఈఓ భిక్షపతి**

ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈఓ భిక్షపతి

చిట్యాల, సెప్టెంబర్ 12 : ప్రభుత్వ పాఠశాలల్లో మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని అందించాలని డీఈఓ బొల్లారం భిక్షపతి ఆదేశించారు. గురువారం మండలంలలోని గుడ్రాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఉపాధ్యాయులతో నిర్వహించి సమావేశంలో మాట్లాడారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంచాలని సూచించారు. ఆయన వెంట ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, వెంకట్‌రావు, రాంరెడ్డి, అబ్దుల్ ఫయాజ్, షరీఫ్ పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : డీఎంహెచ్ఓ శ్రీనివాస్

రాములబండ పీహెచ్‌సీలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ

నల్లగొండ రూరల్, సెప్టెంబర్ 12: వైద్య సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్ఓ పుట్ల శ్రీనివాస్ హెచ్చరించారు. నల్లగొండ మండలం రాములబండ పీహెచ్‌సీని గురువారం ఆయన తనిఖీ చేశారు. ఓపీకి ఎంత మంది వస్తున్నారు, వారికి అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది సమయపాలన వంటి విషయాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట కళ్యాణ చక్రవర్తి, రాములబండ పీహెచ్‌సీ డాక్టర్ జమీర్, సూపర్‌వైజర్ పద్మ, ఏఎన్ఎం ఇందిర, సుచరిత, వెంకన్న ఉన్నారు.

రుణ మాఫీ కోసమే కుటుంబ సభ్యుల నిర్ధారణ సర్వే : ఏడీఏ

మిర్యాలగూడ రూరల్, సెప్టెంబర్12 :అర్హులై ఉండి రుణమాఫీ కాని వారి కుటుంబ సభ్యుల నిర్ధారణ కోసం సర్వే నిర్వహిస్తున్నట్లు ఏడీఏ భూక్యా దేవ్‌సింగ్ అన్నారు. గురువారం మండలంలోని రాయినిపాలెం గ్రామంలో రుణ మాఫీకోసం కుటుంబ సభ్యుల వివరాలు సేకరించారు. రైతులు అధైర్య పడొద్దని, అర్హులందరికీ రుణమాఫీ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ సైదానాయక్, శ్రీనివాస్, అఫ్రిన్ పాల్గొన్నారు.

జాతీయ తైక్వాండో పోటీలకు జిల్లా క్రీడాకారుల ఎంపిక

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

నల్లగొండ రూరల్, సెప్టెంబర్ 12 : ఖేలో ఇండియా జాతీయస్థాయి పోటీలకు జిల్లాకు చెందిన బాలికలు ఎంపికైనట్లు తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎండీ యూనుస్‌కమాల్ తెలిపారు. ఈ నెల 5న హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో ఖేలో ఇండియా రాష్ట్ర స్థాయి పోటీల్లో భాగంగా తైక్వాండో పోటీల్లో జిల్లా కేంద్రానికి చెందిన సఫీయ(59 కిలోల లోపు), జి.అక్షయ(44 కిలోల లోపు), రేష్మ (45 కిలోల లోపు), శ్రేష్ఠ చంద్ర(68 కిలోల లోపు) ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. ఈ నెల 12 నుంచి 14 వరకు తమిళనాడులోని దుండిగల్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో వారు పాల్గొంటున్నట్లు తెలిపారు.

మర్రిగూడ బైపాస్ వద్ద ఆర్టీసీ ప్రత్యేక బస్‌స్టాప్

నల్లగొండ సిటీ/నార్కట్‌పల్లి, సెప్టెంబర్12 : హైదరాబాద్ వెళ్లే ప్రయాణికుల కోసం నల్లగొండ పట్టణ శివారులోని మర్రిగూడ బైపాస్ వద్ద, నార్కట్‌పల్లి బైపాస్ వద్ద ప్రత్యేకంగా స్టాప్‌ను ఏర్పాటు చేసినట్లు రీజినల్ మేనేజర్ రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు ఉదయం 4.30 నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ సౌకర్యం కల్పిస్తున్నామని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సీఎంఆర్ లక్ష్యాన్ని పూర్తిచేయాలి

మిల్లర్లు, అధికారుల సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ, సెప్టెంబర్ 12 : కస్టం మిల్లింగ్ రైస్(సీఎంఆర్) లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు అధికారులు సెలవు దినాల్లో కూడా పనిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ కోరారు. గురువారం తన చాంబర్‌లో రైస్‌మిల్లర్లు, పౌరసరఫరాల, ఎఫ్‌సీఐ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023-24 వానకాలం, యాసంగి సీజన్లకు సంబంధించి సీఎంఆర్‌ను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నెలాఖరు వరకు గడువు విధించిందని తెలిపారు. అందుకు తగిన విధంగా అధికారులు, మిల్లర్లు పని చేయాలన్నారు. 2023 వానకాలానికి సంబంధించిన సీఎంఆర్ ఈ నెల 25లోగా పూర్తి చేయాలని, యాసంగికి సంబంధించినవి 30లోగా అందించాలని ఆదేశించారు. సమావేశంలో డీఎస్ఓ వెంకటేశ్వర్లు, డీఎం హరీశ్, ఎఫ్‌సీఐ మేనేజర్ రఘుపతి, రైస్‌మిల్లర్ల సంఘం నాయకుడు హనుమంతు, మిల్లర్లు పాల్గొన్నారు.

14న గెస్ట్ లెక్చరర్ల కోసం ఇంటర్వ్యూలు

రామగిరి, సెప్టెంబర్ 12 : నల్లగొండలోని చర్లపల్లిలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్స్ కోసం ఈ నెల 14న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పవిత్రావాణి కర్ల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పొలిటికల్ సైన్స్, గణితం, స్టాటిస్టిక్స్‌లో ఒక్కో పోస్ట్, కంప్యూటర్ సైన్స్‌లో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి, అర్హతగల వారు ఉదయం 10 గంటలకు కళాశాలలో జరిగే డెమో, ఇంటర్వ్యూలకు హాజరు కావాలని; వివరాలకు 9000229058 ను సంప్రదించాల ఆమె కోరారు.

సబ్ జూనియర్ ఖోఖో జిల్లా జట్టు కోచ్‌గా నాగేశ్వర్‌రావు

దామరచర్ల, సెప్టెంబర్ 12: సబ్‌జూనియర్ ఖోఖో ఉమ్మడి జిల్లా బాలుర జట్టుకు కోచ్‌గా దామరచర్ల గ్రామానికి చెందిన నూకల నాగేశ్వర్‌రావు ఎంపికైనట్లు రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాతి కృష్ణమూర్తి తెలిపారు. ఈ నెల 13 నుంచి 15 వరకు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టుకు ఆయన కోచ్‌గా వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

22న రైల్వే కాంట్రాక్ట్ కార్మికుల రాష్ట్ర సదస్సు

నల్లగొండ సిటీ, సెప్టెంబరు 12 : సౌత్ సెంట్రల్ రైల్వేలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, బోనస్ చెల్లించాలని కోరుతూ ఈ నెల 22న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ, కోశాధికారి పరిపూర్ణాచారి తెలిపారు. గురువారం రైల్వే స్టేషన్‌లో తెలంగాణ రైల్వే క్యాజువల్, కాంట్రాక్ట్ హమాలీవర్కర్స్ ఆధ్వర్యంలో కార్మికుల సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంటాక్టు కార్మికులకు పీఎఫ్.ఈఎస్ఐ వర్తింపజేయాలని, మహిళా కార్మికులకు ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో యాదమ్మ, సైదమ్మ, కోటేశ్వరి, సైదులు, నాగలక్ష్మి, అజయ్, సాయికుమార్ పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి మృతి ప్రజాస్వామిక వాదులకు లోటు

సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్

ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

రామగిరి, సెప్టెంబర్ 12: సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి ప్రజాస్వామిక శక్తులకు తీవ్ర లోటని పార్టీ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి అన్నారు. నల్లగొండలోని సీపీఎం జిల్లా పార్టీ కార్యాలయంలో గురువారం సాయంత్రం సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థి ఉద్యమం నుంచి పార్టీ ప్రధాన కార్యదర్శి వరకు అంచలంచెలుగా ఎదిగిన సీతారాం ఏచూరి పోరాట జీవితాన్ని గుర్తుచేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద విధానాలు, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాజ్యాంగ పరిరక్షణ, లౌకిక విలువలను కాపాడేందుకు ఇండియా కూటమిని ఏర్పాటులో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. జిల్లాతో ఆయనకున్న అనుబంధాన్ని గుర్తుచేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తుమ్మల వీరారెడ్డి, నారి అయిలయ్య, బండ శ్రీశైలం, చిన్నపాక లక్ష్మీనారాణ, పాలడుగు ప్రభావతి, ఎండీ సలీం, పి.నర్సిరెడ్డి, తుమ్మల పద్మ, సైదులు, అనంతుల శంకరయ్య, సరోజ, మహబూబ్‌అలీ పాల్గొన్నారు,.

పలువురి సంతాపం

సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరి మృతికి మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, ఎంబీసీ జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ సంతాపం తెలిపారు. ప్రజాపోరాట యోధుడిని కోల్పోవటం బాధాకరమని పేర్కొన్నారు. ఏచూరి మృతికి సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం సంతాపం తెలిపారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు గురుకుల విద్యార్థులు

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్

మిర్యాలగూడ రూరల్, సెప్టెంబర్12 : మండలంలోని అవంతీపురం బీసీ గురుకుల బాలుర పాఠశాలకు చెందిన కలకంటి శివ, పుట్ట రుక్విత్ రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్ తెలిపారు. ఈ నెల 13న నిర్మల్‌లో నిర్వహించే పోటీల్లో పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. గురువారం విద్యార్థులను అభినందించి ఎంపిక పత్రాలను అందించారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు..

నందికొండ : నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని బీసీ గురుకుల విద్యార్థులు అండర్ 16 విభాగంలో రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాజశేఖర్ తెలిపారు. నకిరేకల్ మండలం మంగళ్‌పల్లిలో నిర్వహించిన జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో గురుకులానికి చెందిన అశోక్, అనిల్ ప్రతిభ కనబర్చి ఈ నెల 14 నుంచి 16వరకు వరంగల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. గురువారం విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు పీడీ అరుణ్, పీఈటీ నరసింహ అభినందించారు.

ఆగిఉన్న లారీని బైక్ ఢీకొని వ్యక్తి మృతి

దామరచర్ల, సెప్టెంబర్ 12: రోడ్డు పక్కన ఆగిఉన్న లారీని వెనుక నుంచి బైక్ ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం మండల కేంద్రంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వాడపల్లి గ్రామం గాంధీనగర్‌కు చెందిన చల్లారవి(35) బైక్‌పై దామరచర్లకు వెళ్లాడు. పని ముగించుకొని తిరిగి వస్తుండగా దామరచర్ల శివారులో నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై మూలమలుపు వద్ద ఆగిఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. దాంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి భార్య మానిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

ఇంటింటి సర్వేను త్వరగా పూర్తిచేయాలి

- **అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర**

మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ పూర్ణచంద్ర

నకిరేకల్, సెప్టెంబర్ 12 : గ్రామ స్థాయిలో నిర్వహిస్తున్న ఇంటింటి ఓటరు సర్వే వంద శాతం పూర్తిచేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర ఆదేశించారు. ఎస్ఎస్ఆర్‌పై తాసీల్దార్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చనిపోయిన, వలస వెళ్లిన, 18 సంవత్సరాలు నిండిన వారి వివరాలు సేకరించాలని ఆదేశించారు. సమావేశంలో తాసీల్దార్లు ఎస్కే జమీరొద్దీన్, గుగులోతు ప్రసాద్, వెంకటేశ్వర్‌రావు, విజయ, నాయకులు చౌగోని శ్రీనివాస్, ఎల్లపురెడ్డి సైదిరెడ్డి, యాతాకుల అంజయ్య పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం

- **నల్లగొండ సీడీపీఓ తూముల నిర్మల**

మాట్లాడుతున్న సీడీపీఓ తూముల నిర్మల

నీలగిరి, సెపెంబర్ 12 : చిన్నారులు, గర్భిణులు, బాలింతలు రక్తహీనతను నివారించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని తీసుకోవాలని నల్లగొండ సీడీపీఓ తూముల నిర్మల సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ్ అభియాన్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గర్భిణుల్లో రక్త హీనత ఏర్పడితే చిన్నారులు బలహీనంగా, అనారోగ్యంతో పుట్టి చనిపోతున్నారన్నారు. దీని నివారణకు పోషణ్ అభియాన్ పేరుతో 21 రకాల మాడ్యుల్స్‌ను తీసుకు వచ్చినట్లు తెలిపారు. అనంతరం పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సరస్వతి, రాజేశ్వరి, భారతి, లక్ష్మమ్మ, పద్మావతి, రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలని సబ్ కలెక్టర్‌కు వినతి

సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ్‌కు వినతిపత్రం అందచేస్తున్న జిల్లా సాధన సమితి నాయకులు

మిర్యాలగూడ, సెప్టెంబర్ 12: మిర్యాలగూడ పరిసర ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ మిర్యాలగూడ జిల్లా సాధన సమితి నాయకులు డాక్టర్ రాజు, మారం శ్రీనివాస్, మాలోతు దశరథనాయక్, కోల సైదులు గురువారం సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రతన్ సింగ్‌నాయక్, తాళ్లపల్లి రవి, మాడుగుల శ్రీనివాస్, మునీర్, దాసరాజు జయరాజు, బంటు సైదులు, ఫారుఖ్, అంజయ్య, సైదానాయక్, నాగభూషణం పాల్గొన్నారు.

ఆర్టీసీ లాజిస్టిక్స్‌ను వినియోగించుకోవాలి

- **రీజినల్ ఏటీఎం రవీందర్**

అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

నల్లగొండ సిటీ, సెప్టెంబర్12 : ఆర్టీసీ ఏర్పాటు చేసిన లాజిస్టిక్స్‌ను నల్లగొండ పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రీజినల్ ఏటీఎం సి.రవీందర్ అన్నారు. గురువారం నల్లగొండ పట్టణంలోని ప్రకాశంబజార్, డీఈఓ కార్యాలయంతో పాటు పలు ప్రాంతాల్లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రజల కోసం ఆర్టీసీ లాజిస్టిక్స్‌ను అందుబాటులోకి తెచ్చిందన్నారు. తక్కువ సమయంలో తక్కువ ఖర్చుతో వస్తువులను గమ్యస్థానానికి చేర్చనున్నట్లు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని పాడి రైతుల ధర్నా

ధర్నా చేస్తున్న పాడి రైతులు

చిట్యాల, సెప్టెంబర్ 12 : ఉరుమడ్ల పాల కేంద్రంలో జరుగుతున్న అవకతవకలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ గురువారం పాడి రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పాలకేంద్రంలో ఫ్యాట్ నిర్ధారణ విషయంలో అవకతవకలు జరుగుతున్నాయని, దాంతో రైతులకు నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకేంద్రంలో సభ్యత్వ నమోదు నిర్వహించి, డైరెక్టర్ల ఎన్నికలు నిర్వహించాలని, బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాలకేంద్రం పరిధిలోని పాడి రైతులు పాల్గొన్నారు.

కోళ్ల ఫారాల దుర్వాసనతో విద్యార్థుల ఇబ్బందులు

అధికారికి వినతిపత్రం అందిస్తున్న విద్యార్థులు

దేవరకొండరూరల్, సెప్టెంబర్ 12 : మండలంలోని పెంచికల్ పహాడ్ ఆదర్శ పాఠశాల పక్కనే ఉన్న కోళ్లఫారాల నుంచి వచ్చే దుర్వాసనతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వాటిని మూసివేయించాలని కోరుతూ విద్యార్థులు గురువారం తరగతులు బహిష్కరించి ఎంపీడీఓకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల పక్కనే ఉన్నఖాళీ స్థలంలో కోళ్లఫామ్ ఏర్పాటు చేయడంతో వాటి నుంచి వచ్చే దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని, ఆదర్శబాలికల హాస్టల్‌లో ఉండే వారు అన్నం తినలేక పోతున్నారని తెలిపారు. వాటిని మూసి వేయించాలని కోరుతూ ఎంఈఓ, ఎంపీడీఓకు వినతిపత్రం అందించారు.

యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

వేలం కోసం బహిరంగ ప్రకటన -తాకట్టు బంగారు ఆభరణాల ఆస్తుల ఇ-వేలం కోసం బహిరంగ ప్రకటన

దిగువ ఖాతాలలో తాకట్టుపెట్టిన బంగారు ఆభరణాల బహిరంగ వేలాన్ని దిగువ తెలిపిన బ్రాంచ్ వద్ద యాక్సిస్ బ్యాంక్ నిర్వహించుటకు ప్రతిపాదించిందని నిర్దేశిత రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయడమైనది.
దిగువ తెలిపిన రుణగ్రహీతలు సెక్యూరిటీ నిమిత్తం బ్యాంక్ పేరున బంగారు ఆభరణాలు (బంగారు రుణ సౌకర్యం) తాకట్టుపై యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ నుండి రుణ సదుపాయాలను వినియోగించుకున్నారు. వినియోగించుకున్న బంగారు రుణ సౌకర్యం నిమిత్తం తమ బకాయి మొత్తాలను చెల్లించాల్సిందిగా రుణగ్రహీతలు/హామీదార్లను కోరుతూ రుణగ్రహీతలకు /హామీదార్లకు డిమాండ్ నోటీస్‌లు జారీ చేశారు. అయితే రుణగ్రహీతలు/ హామీదార్లు బకాయి రుణ మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, తాకట్టు ఇన్‌వోక్ చేయుట బ్యాంక్‌కు తప్పనిసరి అయింది మరియు ఆస్తి షెడ్యూల్‌లో మరింతగా వివరించిన తాకట్టు బంగారు ఆభరణాలను '' ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలాగే మరియు అక్కడ ఏమున్నదో అదే మరియు రీకోర్స్ పద్ధతి లేని విధంగా''
తేదీ: **23 సెప్టెంబర్ 2024**న మ. **12.30**గం. నుండి మ. **3.30**గం. మధ్య (ఇ-వేలం సమయం) ఇ-వేలం అమ్మకం నిర్వహించుటకు ప్రతిపాదించబడినది.
రుణగ్రహీతలు & బకాయి మొత్తం వివరాలు:

క్ర.సం.	బ్రాంచ్ పేరు	రుణ A/c నం.	వినియోగదారు పేరు	బకాయి మొత్తం	డిమాండ్ నోటీస్ తేది	స్థూల బరువు	నికర బరువు
1	నకిరేకల్ TG	xxxxxxxxxxxxx5722	కట్ల అపర్ణ	160974	16 జనవరి 24	30	28.6
2	మిర్యాలగూడ	xxxxxxxxxxxxx0213	తోట శ్రీనివాస్	317775.8	07 జూన్ 24	91.59	70.96
3	నకిరేకల్ TG	xxxxxxxxxxxxx9984	మెరుగు మహేష్	146406	07 జూన్ 24	30.1	28.6
4	నల్గొండ	xxxxxxxxxxxxx7708	కొమ్ము కరుణాకర్	79015.68	22 జూన్ 24	19.7	18
5	మిర్యాలగూడ	xxxxxxxxxxxxx8528	కుటల కోటేశ్వరరావు	57168.43	26 ఆగస్టు 24	14.8	13.7
6	నకిరేకల్ TG	xxxxxxxxxxxxx3460	వంగల సంతోష్ కుమార్	105329	04 ఆగస్టు 24	23.1	21.1
7	మిర్యాలగూడ	xxxxxxxxxxxxx2347	రామావత్ చంటి	138915.85	26 ఆగస్టు 24	30.6	28.5
8	భువనగిరి TG	xxxxxxxxxxxxx0035	మరబోయిన గోపిచంద్	68493	30 జూలై 24	17.8	15.9

ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా ఖాతాను తొలగించుటకు/ వేలం తేదీని మార్చుటకు యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్‌కు అథారిటీ కలదు. వేలం ఆన్‌లైన్‌లో https://gold.samil.in (ఆన్‌లైన్ వెండార్ యొక్క వెబ్‌సైట్)లో మ. 12.30 గం. నుండి మ.3.30 గం. మధ్య(సమయం) నిర్వహించబడును. సవివరమైన నియమ నిబంధనల కొరకు వెబ్‌సైట్ https://gold.samil.in (ఆన్‌లైన్ వెండార్ యొక్క వెబ్‌సైట్)కు లాగిన్ కావలెను.
అధీకృత అధికారి,యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది

చామకూరి సత్యనారాయణ, S/o.రాములు R/o.1-20, కొత్తలాపురం (గ్రా), గుర్రంపోడు (మం), నల్లగొండ జిల్లా అను నా యొక్క ఒరిజినల్ డాక్యుమెంట్ (నెం.3812/2007) పోయినది దొరికినవారు సంప్ర||9032420191.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు వెలుబుచ్చున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం...
మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...

ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-

Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం

పూర్తి వివరాలకు :
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం,
గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.

నల్లగొండ : 9182777626	నల్లగొండ : 9182777635	దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059	సూర్యాపేట : 9182777630	భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059	కోదాడ : 9182777196	చౌటుప్పల్ : 9182777638

ఆటో నుంచి కిందపడి వ్యక్తి మృతి

నీలగిరి, సెప్టెంబర్ 12 : ప్రమాదవశాత్తు ఆటో నుంచి కిందపడి వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. నల్లగొండ టూటౌన్ ఎస్ఐ రావుల నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ శివారులోని కేశరాజుపల్లి గ్రామానికి చెందిన కాసోజు మార్కండేయ(40) సెంట్రింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సెంట్రింగ్ సామగ్రిని ఆటో వేసుకొని ప్రకాశంబజార్ నుంచి చర్లపల్లికి బయల్దేరాడు. హైదరాబాద్ రోడ్డులో ఎల్‌వీ పెట్రోల్‌బంక్ వద్ద ఆటోకు బర్రెలు అడ్డు రావడంతో ఆటో డ్రైవర్ మహ్మద్ మసీయొద్దీన్ సడన్ బ్రేక్ వేయడంతో డ్రైవర్ పక్కనే కూర్చున్న మార్కండేయ కింద పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, కూతురు, కొడుకు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో కార్పెంటర్ మృతి

చిట్యాల, సెప్టెంబర్ 12 : విద్యుదాఘాతంతో పేరేపల్లి గ్రామానికి చెందిన పోలోజు వెంకటాచారి(50) బుధవారం రాత్రి మృతి చెందాడు. వెంకటాచారి తన షాపులో పని చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే అతడిని నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

చిట్యాల, సెప్టెంబర్ 12 : మండలంలోని పేరేపల్లి శివారులో రెండు వాహనాలలో అక్రమంగా తరలిస్తున్న 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గురువారం పట్టుకున్నట్లు ఎస్ఐ ఎన్. దర్మ తెలిపారు. భువనగిరి మండలం పచ్చర్ల బోడు తండాకు చెందిన ధరావత్ తరుణ్ తన బొలేరో వాహనంలో పేరేపల్లి సమీపంలోని రేషన్ కార్డుదారుల నుంచి బియ్యాన్ని కొనుగోలు చేసి మహీంద్రా రష్ వాహనంలో రైస్ మిల్లులకు తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నాడు. పెద్దవూర మండలం పొట్టిగోనితండాకు చెందిన రమావత్ శంకర్ ఆటోలో రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా రెండు వాహనాలను పట్టుకున్నట్లు చెప్పారు.

టూర్‌గైడ్ల శిక్షణకు దరఖాస్తులు

నందికొండ, సెప్టెంబర్ 12 : నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని బుద్ధవనంలో టూర్‌గైడ్‌ల కోసం వారం రోజుల పాటు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, బుద్ధవనం ప్రత్యేకాధికారి ఎస్. ప్రకాశ్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ శిబిరంలో పాల్గొనేందుకు ఆశక్తి గల వారు ఈ నెల 15లోపు తమ దరఖాస్తులను బుద్ధవనంలో సమర్పించాలన్నారు. శిక్షణలో పాల్గొన వారికి సర్టిఫికెట్లు అందించనున్నట్లు తెలిపారు. వివరాలకు బుద్ధవనం ప్రతినిధి శ్యాంసుందర్‌రావు, సెల్ :9010051177 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

వరద బాధితులకు విరాళం

మిర్యాలగూడటౌన్ :వరద బాధితుల సహాయార్థం పట్టణానికి చెందిన హౌస్ ఆఫ్ ప్రేయర్ ప్రార్థన బృందం సేకరించిన రూ. 10వేలను గురువారం అడిషనల్ కలెక్టర్ పూర్ణచందర్‌కు అందించారు. హన్యానాయక్ రమాబాయి, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జన శోభాయాత్ర

వల్లభరావు చెరువు వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ శరత్ చంద్ర పవార్, కట్టంగూర్‌లో మాట్లాడుతున్న ఎస్ఐ

నల్లగొండలోని ఎల్‌పీటీ మార్కెట్ వద్ద వినాయక నిమజ్జన శోభాయాత్రలో భక్తుల నృత్యాలు

రామగిరి, సెప్టెంబర్ 12 : వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నల్లగొండ జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేశ్ విగ్రహాలను గురువారం నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన శోభాయాత్ర కనుల పండువగా సాగింది. బ్యాండ్ మేళాలు, కోలాటాలు, భజనలతో సాగిన శోభాయాత్రలో యువత అధిక సంఖ్యలో పాల్గొంది. అనంతరం పట్టణ పరిధిలోని పానగల్ బైపాస్ వద్ద గల వల్లభరావు చెరువులో నిమజ్జనం చేశారు.

నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలి

కట్టంగూర్, సెప్టెంబర్ 12 : గ్రామాల్లో గణేశ్ నిమజ్జనానికి పంచాయతీ కార్యదర్శులు తగిన ఏర్పాట్లు చేయాలని ఎస్ఐ ఎన్.శ్రీను సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విగ్రహాలను నిమజ్జనం చేసే చెరువుల వద్ద ప్రమాదాలు జరుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిమజ్జన సమయంలో గొడవలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ పెరుమాళ్ల జ్ఞానప్రకాశ్‌రావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎన్‌జీ కాలేజీలో వినాయక నిమజ్జన శోభాయాత్రలో పాల్గొన్న కళాశాల విద్యార్థులు